క్లుప్తంగా

ఆడపిల్ల చదువు సమాజానికి వెలుగు



ముప్పాళ్ళ: ఆడపిల్ల చదువు సమాజానికి వెలుగని ఆర్సీఎం స్కూల్ హెచ్ఎం పి.రాజేశ్వరి చెప్పారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళ ఆర్సీఎం పాఠశాలలో బాలబాట ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల హక్కుల దినోత్సవం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రాజేశ్వరి మాట్లాడుతూ విద్యావంతులైన బాలికలు ప్రపంచాన్ని మార్చగలిగే శక్తి సామర్థ్యం కలిగి ఉంటారన్నారు. బాలబాట పల్నాడు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ జి.సుబ్బారావు మాట్లాడుతూ సమాజంలో చదువు లేకపోతే ప్రగతి లేదన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. బాలబాట ఏరియా కో–ఆర్డినేటర్ నూనె ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి



అచ్చంపేట: విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని చిగురుపాడులో బుధవారం చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మర్రి గంగయ్య(52) తాను కౌలుకు తీసుకుని సాగుచేస్తున్న మిర్చి పంటకు నీళ్లుపెట్టేందుకు బుధవారం ఉదయం పొలం వెళ్లాడు. తాను వెళ్లిన దగ్గర నుంచి విద్యుత్ లేకపోవడంతో మూడు గంటలవరకు వేచి ఉంచి విద్యుత్ రాగానే మోటారు వేసే క్రమంలో స్విచ్ ఆన్ చేయబోగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే పడిపోయాడు. ఇరుగుపొరుగువారు వచ్చే చూసేసరికి, అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య అలివేలమ్మ, కుమారుడు లక్ష్మీనారాయణ ఉన్నారు. సొంత భూమిలేని గంగయ్య రెండెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి పంట వేశాడు. దురదృష్టవశాత్తు పొలం వెళ్లిన భర్త మృతి చెందడంతో భార్య శోకసంద్రంలో మునిగిపోయింది.

సస్యరక్షణ చర్యలు పాటించాలి



చిలకలూరిపేటటౌన్: పత్తిపంటలో గులాబీరంగు పురు గు నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాట్ సెంటర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.రమేష్ చెప్పారు. బుధవారం మండలంలోని లింగంగుంట్ల, కావూరు, గంగన్నపాలెం గ్రామాల్లో సాగుచేసిన పత్తిపంట పరిశీలించి ఆయన మాట్లాడుతూ అక్టోబర్ నెలలో గులాబీ రంగు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుందని, రైతులు పురుగు ఉనికిని గమనించి నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. గులాబీరంగు పురుగు ఉనికిని తెలుసుకోవటానికి నాలుగు నుంచి 10 లింగార్షక బుట్టలు పెట్టుకోవాలని సూచించారు. వీటి ద్వారా ఉధృతిని తగ్గించుకోవచ్చన్నారు. పురుగును నాశనం చేసే ప్రొఫినోపాస్ 400 మిల్లీలీటర్లు లేదా క్లోరిపైరీపాస్ 500 మిల్లీమీటర్ల మందును పిచికారి చేయాలని సూచించారు. వీటిని ఏడు రోజుల వ్యవధిలో రెండు లేదా మూడు సార్లు పిచికారి చేయాలన్నారు.

ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి

నరసరావుపేట రూరల్: ఈ–పంట నమోదు చేసుకున్న తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి జె.బెన్ని తెలిపారు. మండలంలోని పమిడిమర్రు, కొండకావూరు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. మిరప, పసుపు తదితర పంటలను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని ఆర్‌బీకేను సందర్శించారు. ఆర్‌బీకేలోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ–పంట నమోదు, ఈకేవైసీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి డి.నవీన్‌కుమార్, గ్రామ ఉద్యాన సహాయకులు ఆంజనేయులు, శ్రీకాంత్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రతి గురువారం అర్చక గ్రీవెన్స్‌డే

నరసరావుపేట ఈస్ట్ : జిల్లా పరిధిలోని అర్చకుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి గురువారం ఇస్సప్పాలెం శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయం వద్దనున్న జిల్లా దేవాదాయశాఖ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహిస్తామని దేవాదాయశాఖ జిల్లా అధికారి టి.సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఆలయ కల్యాణ మండపంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో అర్చకుల సమస్యలపై గ్రీవెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా దేవాదాయ శాఖ అధికారి సత్యనారాయణరెడ్డి అర్చకుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇకనుండి ప్రతి గురువారం అర్చకులు నేరుగా తమ కార్యాలయానికి రావచ్చని తెలిపారు. కార్యక్రమంలో అర్చక సమాఖ్య ఉమ్మడి గుంటూరుజిల్లా అధ్యక్షుడు టి.మురళీ, వివిధ ఆలయాల అధికారులు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష.. ప్రజారోగ్యానికి రక్ష

- గ్రామ గ్రామన కొనసాగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు
- రోగులకు ఉచితంగా అన్నిరకాల వైద్యపరీక్షలు, మందులు



చల్లగుండ్ల జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఓపీ రాయించుకుంటున్న ప్రజలు

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజారోగ్యానికి రక్షణగా నిలుస్తుందని సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పంచుమర్తి అప్పారావు అన్నారు. సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పంచుమర్తి అప్పారావు మాట్లాడుతూ పేదల ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి మారుమూల పల్లెల ప్రజలకు సైతం మెరుగైన వైద్యం అందజేస్తున్నార న్నారు. గ్రామ సర్పంచ్ వేమవరపు బుల్లిబాబు మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలన వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యంతో ఉండాలని ఎంతో వ్యయ ప్రయాసలైనప్పటికీ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారన్నారు. ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, తహసీల్దార్ ఎస్.సురేష్, ఈఓపీఆర్డీ దయాసాగర్ మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.గౌతమి, డాక్టర్ ఎం.అనుషారాణి, డాక్టర్ అనిలా రెడ్డి, డాక్టర్ వంశీ లు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 385 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 12 మందిని ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేశారు. 644 మందికి ల్యాబ్ పరీక్షలు నిర్వహించారు. 108 మందికి నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ కాశీ నేత్ర పరీక్షలు నిర్వహించి 88 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. 12 మందికి నేత్రాలకు సంబంధించిన కాటరాక్ట్ పరీక్షలకు రిఫర్ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో న్యూట్రీషన్ స్టాల్ ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

చల్లగరిగలో...

అచ్చంపేట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని చల్లగరిగలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 321 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 11 మంది విద్యార్థులకు, 16 మంది గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 72 మందికి కంటి పరీక్షలు చేసి 63 మందికి కళ్లజోళ్లకు ఎంపిక చేశారు. 16 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ పరిధిలోని వైద్యశాలకు రిఫర్ చేశారు. మాదిపాడు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఎం.ఇన్నారావు, డాక్టర్ రాంబాబు, స్పెషలిష్ట్ వైద్యులు డాక్టర్ ఎస్.ప్రేమ, డాక్టర్ ఎస్.గిరిరాజు తదితరులు వైద్యపరీక్షలు నిర్వహించిన వారిలో ఉన్నారు. ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, వైస్ ఎంపీపీ గంగసాని బాబు, ఎంపీడీఓ పి.శివసుబ్రహ్మణ్యం, ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకట్రావు, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చల్లగుండ్లలో...

నకరికల్లు: మారుమూల పల్లెల్లోని ప్రజల చెంతకు వైద్యం చేర్చిన ప్రజా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి కొనియాడారు. మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరానికి విశేషస్పందన లభించిందని అన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ బి.నాగమణి మాట్లాడుతూ మొత్తం 511మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. వారిలో 132మందికి కంటి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 53మందిని రిఫరల్ చేశామని అన్నారు. డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, డాక్టర్ దుర్గాంబ, డాక్టర్ మౌనిక, కార్డియాలజీ డాక్టర్ మేడికొండ పరమేశ్వరరెడ్డిలు శిబిరంలో పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ జూనెబోయిన హరీష్, సొసైటీ అధ్యక్షుడు మేడికొండ మస్తాన్‌రెడ్డి, సర్పంచ్ అరవా ఆదిలక్ష్మి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు గోపు పద్మావతి అంజిరెడ్డి, జక్కిరెడ్డి కోటిరెడ్డి, అడ్డరోడ్డు సర్పంచ్ బైరెడ్డి సుబ్బారెడ్డి, బత్తుల రామాంజినేయులు, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్డీ ఎంకేఎస్ గిరిధర్, కార్యదర్శి టి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లంకొండలో...

బెల్లంకొండ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంగా ద్వారా మండలంలోని అన్నీ గ్రామాలలో విజయవంతంగా వైద్య శిబిరాలు నిర్వహిచిన ట్లు ఎంపీడీఓ బి.వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన బెల్లంకొండ గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరంలో 628 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసినట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యులు అముసుధూర్ పేర్కొన్నారు. ఐసీడీఎస్ సిబ్బంది పౌష్టికాహారం స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. శిబిరంలో స్త్రీ ప్రసూతి వైద్యులు సందీపిని, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డా.రాజమోహన్‌రెడ్డి, జనరల్ ఫీజిషియన్ డా.సాయికృష్ణ, వైద్య సేవలు అందించారు. వైస్ ఎంపీపీ షేక్ షహనాజ్ బేగం, అహ్మద్ పాషా, సర్పంచ్ గడిపర్తి జ్యోతి, సముద్రం, కో–ఆప్షన్ మెంబర్ షేక్ దరియా పాల్గొన్నారు.

ఊటుకూరులో...

ఊటుకూరు(క్రోసూరు): మండలంలోని ఊటుకూరు గ్రామంలోని జెడ్పీపాఠశాలలో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో 480 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందచేశారు. వైద్యశిబిరానికి డాక్టర్ రమాదేవి, డాక్టర్ బాలఅంకమ్మబాయి, ఎస్.ఉదయశంకర్, సిరిచందన, డాక్టర్ విశ్వనాథ్‌లు పాల్గొన్నారు. వీరితో పాటు ఆరోగ్యవిస్తరణాధికారి శిఖా శ్యాంసన్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పర్యవేక్షించారు.

గణపవరంలో...

రాజుపాలెం: మండలంలోని గణపవరం గ్రామ సచివాలయం –2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం బుధవారం జరిగింది. ఈ శిబిరంలో నిపుణులైన వైద్యులు డాక్టర్ సుష్మ, డాక్టర్ లక్ష్మణరావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ రవితేజనాయక్, డాక్టర్ కిషోర్‌కుమార్‌లు 429 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. 352 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. రక్త పరీక్ష చేయగా అందులో ఇరువురికి డెంగీ పాజిటీవ్ అని తేలడంతో సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు పంపించారు. ఏడుగురికి మలేరియా అని తేలడంతో వారికి మందులు పంపిణీ చేశారు. 184 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. త్వరలో కళ్లజోళ్లు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొలమాల నాగమల్లేశ్వరరావు, సూపర్‌వైజర్ ఉషారాణి, గ్రామ సచివాలయ సిబ్బంది, ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బొల్లవరంలో...

బొల్లవరం(ముప్పాళ్ళ): మండలంలోని బొల్లవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం బుధవారం జరిగింది. గ్రామ సర్పంచ్ బద్దిగం పూజితారెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ పర్యవేక్షణలో ఆరుగురు వైద్య నిపుణులు 398మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించారు. కంటి వైద్య నిపుణులు మధుబాబు పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ళజోళ్లు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.భవాని శంకర్, ఎంపీడీఓ పి.పుట్టారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, సచివాలయ జేసీఎస్ కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



ఫణిదంలో గుండె పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



ఫణిదంలో రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

జగనన్న ఆరోగ్య సురక్షను వినియోగించుకోవాలి..



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న ఎంపీపీ మేకల హనుమంతరావు

అమరావతి: మండల పరిధిలోని ధరణికోట–1 గ్రామ సచివాలయంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని బుధవారం ఎంపీపీ మేకల హనుమంతరావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్యంకోసం నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించటానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ప్రారంభించారన్నారు. ఈకార్యక్రమంలో అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శివరత్నకుమార్, వైద్యాధికారులు స్వర్ణరేఖ, తేజస్విని, కీర్తిలు 506 మంది రోగులను పరీక్షించి రోగులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఎంపీడీఓ పావులూరి ఉమాదేవి, ఈవోపీఆర్డీ గంగాధర్, గ్రామ సర్పంచ్ మాదాసు పావని, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, నాయుడు రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది, ఆయుష్ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దు

సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ



మాట్లాడుతున్న డీఎస్పీ ఆదినారాయణ

అచ్చంపేట: నేరాలకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని, ఒక్కసారి నేరం చేస్తూ పట్టుపడితే భవిష్యత్ అంధకారమేనని సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ అన్నారు. వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలకు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. 13 ద్విచక్రవాహనాలు, 3 కార్లు, ఒక ఆటోకు వేలం నిర్వహించారు. వీటిలో కొన్ని స్క్రాప్ వాహనాలు కూడా ఉన్నాయి. వీటికి నిర్వహించిన వేలంలో పాల్గొనేందుకు దరావత్తుగా రూ.2వేలు నిర్ణయించగా అన్ని వాహనాలు కలిపి రూ.5,18,679లకు పాటదారులు సొంతం చేసుకున్నారు. ఈ మొత్తం ప్రభుత్వ ఖజానాకు జమచేస్తామని డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పట్టుబడిన వాహనాలలో ఎక్కువ భాగంగా తెలంగాణ నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తూ పట్టుబడినవేనన్నారు. సీఐ కె.వీరాస్వామి, ఎస్ఐ సీహెచ్ మణికృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి

అమరావతి: పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసం కోసం మూడు రోజుల పాటు ఉచితంగా శిక్షణ తరగతులను స్టెప్ సంస్థ (స్టూడెంట్స్, టీచర్స్, ఎడ్యుకేటర్స్, పేరెంట్స్) ఆధ్వర్యంలో ఈనెల 15, 16, 17 తేదీలలో నిర్వహిస్తున్నామని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ తాడికొండ మండలం, నెక్కల్లు గ్రామంలో శ్రీ రమణారావు – శ్రీమతి సావిత్రమ్మ ధ్యాన ఆరోగ్య ఆశ్రమం (శ్రీ బుద్ధాశ్రమం)లో మూడు రోజుల ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిక్షణలో టీచర్లు, విద్యార్థులు, విద్యావంతులు, పేరెంట్స్ పాల్గొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆయన కోరారు. ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యే వారికి ఉచిత వసతి మరియు భోజన ఏర్పాట్లు, మెటీరియల్‌తోపాటుగా పరిపూర్ణ శిక్షణ, సర్టిఫికెట్ ఇస్తారన్నారు. ఎంపీపీ మేకల హనుమంతరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తమ వెసులుబాటును బట్టి పాల్గొనాలని సూచించారు. ఈ సమావేశంలో శ్రీ రామకష్ణ హిందూ హైస్కూల్ హెడ్మాస్టర్ రాము, నందూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ



లబ్ధిదారుడికి ఇంటి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: మండల పరిధిలోని లేమల్లె గ్రామ ప్రజల సమస్యల పరిష్కారం కోసం బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో అన్నివర్గాల ప్రజలతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గ్రామసభ నిర్వహించారు. గతంలో అర్హులై ఉండి ఇళ్లస్థలాల పట్టాలు రానివారికి బుధవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చేతుల మీదుగా పట్టాలు పంపిణీజేశారు. ఈసందర్భంగా వైఎస్సార్ బీమా క్లెయిమ్ రాని ఇద్దరు లబ్ధిదారులకు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి అక్కడిక్కడే సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేశారు. అలాగే ఫెడ్రిక్ హెటాక్సిమా వ్యాధితో బాధపడుతున్న ఇద్దరు అక్కచెల్లెళ్లు షేక్ షర్మిల, హసీనాలను పరామర్శించి వారికి వెంటనే సదరన్ సర్టిఫికెట్లు ఇవ్వవలసిందిగా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిరంతరం ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారం కృషి చేస్తున్నానన్నారు.

లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి చెక్కులు అందజేత..

గత సంవత్సరం అమరావతిలో వినాయక నిమజ్జనం కోసం వచ్చి కృష్ణానదిలో మునిగి మృతిచెందిన లేమల్లెకు చెందిన బలుసుపాటి విజయ భార్గవాచారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును నేరుగా లబ్ధిదారుని ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే శంకరరావు అందించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.2 లక్షల చెక్కును విజయభార్గవాచారి భార్య శ్రీలేఖకు అందజేశారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచి ఉగ్గం పున్నమ్మ, ఎంపీటీసీ షేక్ నాగుల్ మీరావలి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, మండల జేసీఎస్ అధ్యక్షుడు నాయుడు రాంబాబు, నాయకులు ఆళ్ల శ్రీనివాసరెడ్డి, వీరరాఘవయ్య, ఉగ్గం యలమందయ్య, సైదావలి పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు వృందా విద్యార్థిని



జ్యోతిని అభినందిస్తున్న డైరెక్టర్ అనూష

సత్తెనపల్లి: పట్టణంలోని వృందా మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని మట్టుపల్లి జ్యోతి చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగిన 67వ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలలో ప్రతిభ చూపి గుంటూరు జిల్లా జట్టు మూడో స్థానంలో నిలవడానికి కృషి చేసిన జ్యోతిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు గంప శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. జనవరిలో పంజాబ్‌లో జరగబోయే 67వ జాతీయ ఫుట్‌బాల్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో మట్టుపల్లి జ్యోతి ప్రాతినిధ్యం వహించి ఆంధ్రప్రదేశ్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచేలాగా కృషి చేయాలని కళాశాల డైరెక్టర్ గంగారపు అనుష, ప్రిన్సిపాల్ రావిపాటి శ్రీనివాసరావులు ఆకాంక్షించారు. ఈసందర్భంగా జ్యోతిని ప్రత్యేకంగా అభినందించారు. అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ఫుట్‌బాల్ జిల్లా జట్టుకు హోలీ ఫ్యామిలీ విద్యార్థిని



ప్రణీతతో హెచ్ఎం సిస్టర్ విజయారాణి, పీఈటీలు

సత్తెనపల్లి: ఫుట్‌బాల్ జిల్లా జట్టుకు పట్టణంలోని హోలీ ఫ్యామిలీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎస్.ప్రణీత ఎంపికైంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ –14 బాలికల గుంటూరు జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించారు. ప్రణీత గోల్ కీపర్‌గా జిల్లా జట్టుకు ఎంపి కావడంతో బుధవారం పాఠశాల ప్రాంగణంలో అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సిస్టర్ విజయారాణి, పీఈటీలు ఎస్.అచ్చిరెడ్డి, రాజా, ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



మేళ్లవాగు గ్రామంలో నిల్వ ఉంచిన రేషన్ బియ్యం

బొల్లాపల్లి: మండలంలోని మేళ్ళవాగు గ్రామంలో బుధవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడులో ప్రజా పంపిణీ బియ్యం పట్టుబడింది. పౌరసరఫరాల డిప్యూటీ లక్ష్మణరావు వై. లక్ష్మణరావు తెలిపిన వివరాలు ప్రకారం గ్రామంలో సచివాలయం పక్కనే ఉన్న రేకుల షెడ్‌లో ప్రజా పంపిణీ బియ్యం నిల్వ ఉన్నట్లు సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడిలో 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనపరచుకున్నారు. గ్రామానికి చెందిన బి.కృష్ణారెడ్డి షెడ్‌లో రేషన్ బియ్యం నిల్వ ఉందని, ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఈ రేషన్ బియ్యం సుమారు రూ.87500 విలువ ఉంటుందని సీఎస్‌డీటీ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ శ్రీహరి, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

అక్రమంగా విద్యుత్ వినియోగించొద్దు

యడ్లపాడు: విద్యుత్ అక్రమ చౌర్యం లేదా అదనపు వినియోగం చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఆర్‌డీపీ విజిలెన్స్ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు. యడ్లపాడు మండలంలో విద్యుత్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. గుంటూరు–2 పరిధిలో కొనసాగిన ఈ ఆపరేషన్‌ను ఎం.విజయ్‌కుమార్ నేతృత్వం వహించారు. మండలంలోని 23 గ్రామాల్లో 36 బృందాలుగా విభజించి ఈ దాడులు నిర్వహించారు. ఉదయం 8.30 నుండి సాయంత్రం వరకు 2,583 విద్యుత్ సర్వీసులను తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో విద్యుత్ అక్రమ చౌర్యం, అలాగే విద్యుత్ అదనపు లోడు వాడుతున్న 81 సర్వీసుల్ని అధికారులు గుర్తించి ఆయా సర్వీసుల యజమానులకు రూ.5,99,700 జరిమాన విధించారు. వీటిలో విద్యుత్ చౌర్యం చేస్తున్న వారు 18 మంది ఉండగా వారికి రూ.2,93,000 అపరాధ రుసుం, అదనపు లోడు వినియోగిస్తున్న 63 మంది వినియోగదారులకు రూ.3,06,700 అపరాధ రుసుం విధించినట్లు అధికారులు వెల్లడించారు. విజిలెన్స్ ఈఈ కేవీఎల్ఎన్ మూర్తి, గుంటూరు –2 ఈఈ సీహెచ్ రమేష్‌బాబు, చిలకలూరిపేట డీఈ ఆర్ అశోక్‌కుమార్ ఉన్నారు.

సత్తెనపల్లిలో 'మన ప్రేమ కావ్యాంజలి' షూటింగ్ ప్రారంభం



క్లాప్ కొడుతున్న మక్కెన అచ్చయ్య, కెమెరా స్విచ్ ఆన్ చేస్తున్న సుబ్బారెడ్డి

సత్తెనపల్లి: స్వర్ణ సినీ క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన 'మన ప్రేమ కావ్యాంజలి' యూట్యూబ్ షార్ట్ ఫిల్మ్ ప్రారంభోత్సవం సత్తెనపల్లి పట్టణంలోని వడ్డవల్లి పోలేరమ్మ ఆలయంలో బుధవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా ప్రగతి విద్యా సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ మక్కెన అచ్చయ్య క్లాప్ కొట్టగా, షేక్ సైదా స్క్రిప్టును మన ప్రేమ కావ్యాంజలి చిత్ర దర్శకుడు సిద్దెల సురేష్‌కు అందజేశారు. ప్రముఖ న్యాయవాది ఎం.వి.సుబ్బారెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేసి మొదటి సన్నివేశానికి దర్శకత్వం వహించారు. తొలి సన్నివేశాన్ని హీరో, హీరోయిన్‌ల మీద చిత్రీకరించారు. హీరోగా సుబ్బు, హీరోయిన్‌గా కావ్య, హీరోయిన్ ఫాదర్‌గా సత్తెనపల్లికి చెందిన లక్ష్మీ చెన్నకేశవ, హీరో ఫాదర్‌గా పిడుగురాళ్ల అమీర్, సురభి శ్రీను, మల్లేశ్వరి, మహిత, జానీ, స్వాతి ఈ చిత్రంలో నటిస్తున్నారు. దేవుడి దీవెనలతో, శ్రేయోభిలాషుల ఆశీస్సులతో వీరందరూ... కలసి నేను ప్రాణానికి ప్రాణంగా ప్రేమిచిన 'మన ప్రేమ కావ్యాంజలి' కథకు ప్రాణం పోస్తారని నమ్ముతున్నానని చిత్ర దర్శకుడు సిద్దెల సురేష్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇది మన ప్రేమ కావ్యాంజలి కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం సిద్దెల సురేష్, కెమెరా అను క్రియేషన్స్ విష్ణు వారాసి.